క్లుప్తంగా

'ధ్యానంతో ఒత్తిడి దూరం'

భైంసాటౌన్: ధ్యానం, యోగా సాధనతో మానసిక, శారీరక ఒత్తిడి దూరం అవుతుందని విపశ్యన సాధకులు ప్రసంజిత్ హేమ్లే అన్నారు. పట్టణంలోని రాహుల్‌నగర్ బుద్ధ విహార్‌లో బీఐఎస్ ఆధ్వర్యంలో విపశ్యన గురువు సత్యనారాయణ గోయెంకా వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో బీఐఎస్ సభ్యులు ఏక్‌నాథ్ బిరదే, గణేశ్ హేమ్లే, బౌద్ధ ఉపాసకులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో డీఐఈవో తనిఖీ

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డీఐఈవో పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల హాజరుశాతం పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ కైసర్‌పాషను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అధ్యాపకులు గోపాల్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'

భైంసారూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్ధూర్, మిర్జాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాలను ఎగురవేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన దుర్గాభవాని

నిర్మల్: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే..ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిలను కలిశారు. తాను టికెట్ ఆశిస్తున్న బెల్లంపల్లి నియోజకవర్గంతోపాటు నిర్మల్ జిల్లాలోని నియోజకవర్గాల సమాచారాన్ని వారికి వివరించినట్లు ఆమె తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి సాయం అందించరూ

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ ఈనెల 27న మంజులాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డ్ కిరణ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పేద కుటుంబానికి చెందిన కిరణ్‌కు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారన్నారు. తోచినంత సాయం ఫోన్ పే నెం .99637 07758 కు పంపాలని విజ్ఞప్తి చేశారు.

పేదింటి వివాహానికి సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

సోన్: మండలంలోని జాఫ్రాపూర్‌కు చెందిన మహబూబ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కూతురు వివాహానికి వశిష్ఠ విద్యాసంస్థల చైర్మన్ వి.సత్యనారాయణ గౌడ్ రూ.20వేలు పంపించగా.. శుక్రవారం విద్యాసంస్థ ప్రతినిధులు బాధిత కుటుంబం ఇంటికెళ్లి నగదు అందించారు. గతంలో మహబూబ్.. సత్యనారాయణ వద్ద పని చేశాడు. బర్మదాసు, మౌలాన, సాదు, రాంరెడ్డి, రమేశ్‌రెడ్డి, స్వామి, రాము, అజిత్ పాల్గొన్నారు.

సంతలో గొడుగుల పంపిణీ

సారంగాపూర్: మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వారసంతలో చిరువ్యాపారులకు ఐకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు గొడుగులను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాధవరావు, నాయకులు రాజ్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, నాగయ్య, లక్ష్మీనారాయణ, దేవిముత్యం, అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిరండి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వచ్చే నెల 2న నిర్వహించే ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు తరలిరావాలని ముదిరాజ్ సంఘం నాయకులు యాటకారి సాయన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తమ సంఘ కార్యాలయంలో ఆత్మగౌరవ సభ గోడప్రతులను ఆవిష్కరించారు. గణేశ్, ఉమామహేశ్వర్, సుంకరి పోతన్న, రమేశ్, డి.శంకర్, శేఖర్, మహీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటన



నర్సాపూర్(జి): భిక్షాటన చేస్తున్న సిబ్బంది

నర్సాపూర్(జి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరుకుంది. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.
కుంటాల: మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మెకు బీజేపీ నాయకులు రామారావ్‌పటేల్ మద్దతు తెలిపారు. వారు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ గజ్జారాం, వెంగళరావు, నవీన్, లక్ష్మణ్ పటేల్, భూమన్న, రమణారావు, ఫహీంఖాన్, వేణు పాల్గొన్నారు.

డ్యూటీలోనే ఖాకీ..

- ఇంటిల్లిపాదికి దూరంగా..
- పండుగ పూటా.. విధుల్లోనే పోలీసులు
- ఫోన్లలో పిల్లలను సముదాయిస్తూ..
- కనురెప్ప వాల్చకుండా నిల్చుంటూ..
- నవరాత్రులు విజయవంతం చేసిన వైనం



బిడ్డా.. నేను డ్యూటీలో ఉన్నా..

'డాడీ.. డాడీ.. ఎక్కడున్నవ్. ఇంకెప్పుడు ఇంటికొస్తవ్. గణపతులను చూడటానికి మమ్మీని నన్ను ఎప్పుడు తీసుకెళ్తవ్.. తొందరగా రా డాడీ..' అంటూ సరిగ్గా మాటలు కూడా రాని చిన్నారి వీడియో కాల్‌లో తండ్రిని అడుగుతోంది. 'వస్తా.. వస్తా.. బేటా. నేను ఇప్పుడు డ్యూటీలో ఉన్నా.. ఇది కాగానే ఇంటికొస్త. ఓకేనా..! ఇదిగో ఇటు చూడు.. ఎంత పెద్ద గణపతో.. బాగుంది కదా. పాటలు వింటున్నవా చిట్టితల్లి.. నువ్వు కూడా డ్యాన్స్ చేయు. అమ్మ పాటలు పెట్టి, ఆడిపిస్తుంది బాగా ఆడుకో.. తొందరగా పడుకో తల్లీ. డ్యూటీ అయిపోగానే వచ్చేస్తా, నేను వచ్చిన తర్వాత మస్తు ఆడుకుందాం సరేనా..! నీకు వచ్చేటప్పుడు ఏం తీసుకురావాలో చెప్పు..' అంటూ తన చిట్టితల్లిని మాటల్లో పెట్టి మరిపిస్తున్నాడు ఆ పోలీసు తండ్రి. ఈ దృశ్యం నిర్మల్‌లో గురువారం రాత్రి సాగిన వినాయక శోభాయాత్రలో కనిపించింది.



జిల్లాకేంద్రంలో శోభాయాత్ర విధుల్లో పోలీసులు

నిర్మల్: అందరూ ఇంటిల్లిపాదితో పండుగ చేసుకుంటుంటే.. పోలీసులు మాత్రం కనురెప్ప కూడా వాల్చకుండా డ్యూటీలో నిమగ్నమయ్యారు. ఒక ట్రెండు రోజులు కాదు.. మొత్తం వినాయక నవరాత్రులన్నీ విధి నిర్వహణలో కొనసాగారు. జిల్లాలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసుశాఖ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ నిమజ్జనం విజయవంతంగా పూర్తిచేసింది. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో జిల్లా పోలీసులతోపాటు పక్క జిల్లాల అధికారులు, సిబ్బంది కూడా పండుగ విధుల్లో పాల్గొన్నారు.

24/7డ్యూటీలోనే..

గణేశ్ ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచీ పోలీసుశాఖకు ప్రత్యేక విధులు మొదలయ్యాయి. ప్రతీ పెద్ద గణేశుడి మండపం వద్ద కానిస్టేబుళ్లు 24 గంటలపాటూ అక్కడే ఉంటూ విధులు నిర్వర్తించారు. వారితో పాటు పొద్దున, రాత్రికి పలు బృందాలుగా పోలీసు అధికారులు గస్తీ తిరిగారు. సీసీ కెమెరాలు, బ్లూకోట్స్, ప్రత్యేక బృందాలు ఇలా రకరకాలుగా వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా విజయవంతం చేసేందుకు శ్రమించారు.

పదకొండు రోజులూ...

వినాయక ఉత్సవాల ప్రారంభానికి ముందు నుంచే పోలీసులకు పని మొదలైంది. ముందస్తు ఏర్పాట్లు, పర్మిషన్లు, రూట్‌మ్యాప్, నిమజ్జనం వద్ద ఏర్పాట్లు.. ఇలా పనులు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు నుంచే మండపాల్లో విధులు, గస్తీ మొదలైంది. ఇక జిల్లాలో ఐదోరోజు నుంచే నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలల గణేశ్ మండళ్లు, పలు కాలనీల్లో నిమజ్జనోత్సవాలు చేపట్టారు. ఆ తర్వాత ఏడో రోజు, తొమ్మిది, పదకొండు రోజులకు అంటూ వరుసగా గణేశ్ శోభాయాత్ర, నిమజ్జనం నిర్వహించారు. చిన్నపెద్దా అనే తేడా లేకుండా సంబంధిత డ్యూటీలో ఉన్న పోలీసులు ప్రతీ ప్రతిమ వెంట అడుగులో అడుగు వేస్తూ సాగారు. ఎన్నికల సీజన్, రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ఈసారి ఎవరినీ ఏమనకుండా నచ్చజెప్తూ శోభాయాత్రను ముందుకు సాగించారు. ప్రధానంగా భైంసా, నిర్మల్ నిమజ్జనోత్సవాలను కత్తిమీద సాములా నిర్వహించారు. ఓవైపు ఎండ, మందమైన ఖాకీ డ్రెస్‌లో భరించలేని ఉక్కపోత, మరోవైపు భారీవర్షం ఇలా.. వాతావరణం పెట్టిన పరీక్షలనూ తట్టుకుంటూ రోడ్లపైనే గంటల తరబడి నిలబడుతూ.. కనురెప్ప వాల్చకుండా ఖాకీలు వినాయక ఉత్సవాలను విజయవంతంగా పూర్తిచేసేందుకు శ్రమించారు.

అందరి సహకారంతో..



జిల్లా ప్రజలందరి సహకారంతో వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా పూర్తిచేసుకున్నాం. భైంసా, నిర్మల్‌లో నూ శోభాయాత్రలు ప్రశాంతంగా నిర్వహించాం. మొత్తం వెయ్యిమంది వరకు పోలీసులం గణేశ్ నవరాత్రుల విధుల్లో పాలుపంచుకున్నాం. విధి నిర్వహణలో ప్రతీ పోలీసు పక్కాగా పనిచేశారు. వారికి సహకరించిన జిల్లా ప్రజలకూ కృతజ్ఞతలు.

– ప్రవీణ్‌కుమార్, ఎస్పీ

వ్యాయామంతో ఆరోగ్యంగా ఉంటాం



ర్యాలీ ప్రారంభిస్తున్న సీఐ శ్రీను, కాశీనాథ్

భైంసాటౌన్: ప్రతిరోజు వ్యాయామం చేస్తే వ్యాధులకు దూరం ఉండి ఆరోగ్యంగా ఉంటామని ఏరియా స్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకుని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా పట్టణ సీఐ ఎల్.శ్రీను జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంతకు ముందు పలువురు గుండె సంబంధిత వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ముష్కం రామకృష్ణాగౌడ్, ప్రిన్సిపాల్ సాయినాథ్ తదితరులు ఉన్నారు.
ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో ప్రపంచ గుండె దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: హరితవిప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశంలోని రైతాంగానికి తీరని లోటని ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో స్వామినాథన్ మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం వారి చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్రప్రభుత్వాలకు వారు ఇచ్చిన నివేదికలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేసి రైతాంగాన్ని ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేశాయని గుర్తు చేశారు. రాజన్న, ఎల్లయ్య, లచ్చన్న, శ్రీనివాస్, రాజలింగు, తదితరులు ఉన్నారు.

మొదటి ఏడాది గెలను తొలగించాలి



ఆయిల్‌పాం మొక్కను పరిశీలిస్తున్న మేనేజర్

లోకేశ్వరం: ఆయిల్‌పాం సాగు చేసిన రైతులు మొదటి ఏడాదిలో వచ్చిన గెలను తొలగించాలని భైంసా ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని మొహాళ, గడ్‌చాంద, కిష్టాపూర్, నగర్ గ్రామాల్లో సాగు చేసిన ఆయిల్ పాం మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొదటి గెలను తొలగిస్తే తర్వాత వచ్చిన గెలలు నాణ్యతగా ఉంటాయన్నారు. లోకేశ్వరం క్లస్టర్ ఆయిల్‌పాం అధికారి శేఖర్, రైతులు ఉన్నారు.

'విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి'

భైంసాటౌన్: సోయా పంట 65–70 రోజుల వ్యవధిలోనే ఎండిపోతుందని, తెగుళ్లు తట్టుకోలేని నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో భైంసాలోని ఏడీఏ కార్యాలయంలో ఏడీఏ వీణకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ కేడీఎస్, ఈగల్ కంపెనీ సోయా విత్తనాలు వేసిన పంటక్షేత్రాల్లో గతంలో లేనివిధంగా తెగులు సోకి కాయ దశలోనే పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు పంటలు పరిశీలించి నమూనాలు సేకరించడంతోపాటు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, పోశెట్టి, సంపత్ పటేల్, రఘువీర్, రైతులు లింగారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్వచింతల్, కోలాంగూడ గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మరణించగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎర్వచింతల్ ఉపసర్పంచ్ దేవేందర్‌తో పాటు పలువురు నాయకులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిక్కు నాయక్, కొడారి రవీందర్, కొడారి నరేశ్, అలిశెట్టి రాజు, పరమేశ్వర్, కలిరాం, సుధాకర్, రాజు, ఫకీర్‌సింగ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో బొజ్జు

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు దాసరి లక్ష్మణ్‌తో పాటు ఆయన అనుచరులు 300 మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, నర్సయ్య, విలాస్‌రావు,అబ్దుల్ హాదీ తదితరులు ఉన్నారు.

రెండోరోజుకు కార్మికుల సమ్మె

తానూరు: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ప్రభుత్వం పెంచిన వేతనం, వంట బిల్లులు విడుదల చేయాలని కోరారు. భరత్‌బాయి తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- నర్సాపూర్(జి) మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రేఖ



మాట్లాడుతున్న ఎంపీపీ కొండ్ర రేఖ

నర్సాపూర్(జి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కొండ్ర రేఖ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నర్సాపూర్(జి) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంఈఓ కస్తూరి శంకర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె కారణంగా పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండడం లేదన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీకి 132 మంది దరఖాస్తు చేసుకున్నారని పశువైద్యాధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. పంచాయతీ నర్సరీల్లో జనాభా ప్రాతిపదికను మొక్కలను పెంచాలని ఎంపీడీఓ వనజ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు.

బిల్లులు రాలేదు..

గొల్లమాడ సర్పంచ్ చెన్న మహేశ్ మాట్లాడుతూ గ్రామంలో క్రీడా ప్రాంగణం నిర్మించి ఏడాది గడుస్తున్నా.. సంబంధించిన రూ.లక్షా యాభై వేల బిల్లు రాలేదని వాపోయారు. స్పందించిన ఏపీఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఆరోగ్యశాఖపై ఆగ్రహం..

నర్సాపూర్(జి) ఎంపీటీసీ మల్లేశ్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా సర్వసభ్య సమావేశాలకు ఆరోగ్యశాఖ అధికారులు రాకుండా సిబ్బందిని పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.విద్యుత్, నీటిపారుదల, మత్స్యశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండల సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, ఏఓ జాదవ్ సాయికిరణ్, జెడ్పీటీసీ చిన్న రామయ్య, వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మి, తహసీల్దార్ గజానన్, సీడీపీఓ నాగమణి, కోఆప్షన్ సభ్యులు ఫసి, తురాటి సర్పంచ్ అశ్విని, అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో వినాయక నిమజ్జనం



టాంజానియాలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



అమెరికాలో మట్టి విగ్రహంతో చిన్నారులు

నిర్మల్: వినాయకుడు మన గల్లీల్లోనే కాదు.. విదేశాల్లోనూ పూజలందుకున్నాడు. అమెరికాలోని కొలంబస్‌లో ఆలయ ప్రాంగణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. పిల్లలకు మట్టితో విగ్రహాలు తయారు చేయడం నేర్పించి.. వాటికే పూజలు చేసి నిమజ్జనం చేసినట్లు నిర్మల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బ్రహ్మరౌతు సునీల్‌వర్మ తెలిపారు. టాంజానియా దేశంలోని ఇరింగ పట్టణంలోనూ వినాయక నవరాత్రులు నిర్వహించారు. అక్కడ ఉండే భారతీయులంతా కలిసి ఈ వేడుక నిర్వహించి స్థానిక నదిలో నిమజ్జనం చేసినట్లు నిర్మల్‌వాసి ఆర్.మహేందర్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

గ్రామాల్లో మేరీ మిట్టి– మేరా దేశ్

కుంటాల: మేరీ మిట్టి– మేరా దేశ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని ఓలా, కుంటాల, లింబా(కె), కల్లూర్ గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో భైంసా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ, సర్పంచ్‌లు సమత, కనీస్ ఫాతిమా, ఆనందరావు పటేల్, పోస్టల్ ఎంవో నరేష్ కుమార్, నూనె నర్సయ్య, జుట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోష్, బోగ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రశాంతంగా నిమజ్జన శోభాయాత్ర

నిర్మల్‌టౌన్: పట్టణంలో నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గుల్జర్ మజీద్ వద్ద మతపెద్దలు ఎస్పీని శాలువాతో సత్కరించారు. కుల మతాలకతీతంగా వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలు జరుపుకొన్నట్లు పేర్కొన్నారు. సహకరించిన గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు, ప్రజలకు ఎస్పీ కతజ్ఞతలు తెలిపారు. పట్టణ సీఐ పురుషోత్తం, కౌన్సిలర్ తాహీద్ రప్పు, మజీద్ అధ్యక్ష, కార్యదర్శులు బషీర్ అలీ, వాహీద్, రఫీక్, అస్లాంఖాన్, అసిఫ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

సోన్: నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఉత్తమ సేవలు అందించినందుకు మండలంలోని కడ్తాల్ గ్రామంలో పారిశుధ్య కార్మికులను గ్యాంగ్ స్టార్ యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో మెమెంటో, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండలి సభ్యులు పాల్గొన్నారు.

హరిత మేనేజర్‌కు సన్మానం

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్ మేనేజర్ నునావత్ తిరుపతిని శుక్రవారం స్థానిక నాయకులు సన్మానించారు. హైదరాబాద్ శిల్పారామంలో ఇటీవల నిర్వహించిన పర్యాటక దినోత్సవంలో కడెం హరిత రిసార్ట్స్ బెస్ట్ రిసార్ట్స్ అవార్డు అందుకుంది. రాజేందర్, కిషన్‌నాయక్, సురేశ్‌నాయక్, రమేశ్, రాజేశ్, లింగన్న, తదితరులు ఉన్నారు.

'అటవీ అధికారులు స్థలం అప్పగించాలి'

కడెం: గతంలో ఇస్తామన్న స్థలాన్ని అటవీశాఖ అధికారులు తమకు అప్పగించాలని మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామస్తులు డిమాండ్‌చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. తాతల కాలం నుంచి బర్ల మందకు, వరి కొనుగోలు కేంద్రానికి ఉపయోగిస్తున్న స్థలంలో రాంపూర్, మైసంపేట గ్రామస్తుల పునరావాస కాలనీ ఏర్పాటు చేశారన్నారు. ఉపసర్పంచ్ జాగిరి శ్రీనివాస్, దుల్లె వెంకటేశ్, భూమన్న, గంగాధర్, రవి, పోషం, పవన్, రాజన్న, తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం అండర్–14, 17 జిల్లాస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రమణారావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్నపూర్ణ, భూమన్న, క్రికెట్ కోచ్ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పెంబికి చేరిన రథం

పెంబి: టీటీడీ ధర్మ ప్రచార రథం శుక్రవారం పెంబికి చేరగా హరిహర ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు పల్లకి సేవ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవరకోట దేవస్థానంలో శనివారం స్వామివారికి అభిషేకం, పల్లకిసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు రావాలని కోరారు.

ఆశవర్కర్ల నిరసన

కుంటాల: మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశవర్కర్లకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావు పటేల్ మద్దతు తెలిపారు. ఎంపీపీ గజ్జారాం, వెంగళరావు, ప్రణయ్‌రావు పాల్గొన్నా రు.
లోకేశ్వరం: తమ సమస్యలను పరిష్కరించాలని ఆశవర్కర్లు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆనంద, గోదావరి, కల్యాణి, స్వప్న, సాయన్న, అనురాధ, సవిత, శారద, సబిత, గంగామణి, మమత పాల్గొన్నారు.

పొదుపు చేయించాలి

కుంటాల: మహిళలచే పొదుపు చేయించాలని ఏపీఎం అశోక్ సూచించారు. శుక్రవారం స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు లింకేజీ స్త్రీ నిధి, పుస్తక నిర్వహణ, తదితర అంశాలను చర్చించారు.

కొనసాగుతున్న శోభాయాత్ర



లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ప్రారంభమైన వినాయడి నిమజ్జన శోభాయాత్ర శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగుతూనే ఉంది. రాత్రి వరకు యువత నృత్యాలు చేస్తూనే ఉన్నారు. కొన్ని గ్రామాల్లో శనివారం వరకు నిమజ్జనం కొనసాగే అవకాశం ఉంది.
కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం ఘనంగా వినాయకుడి నిమజ్జనం నిర్వహించారు. సర్పంచ్ కనీశ్ ఫాతిమా, ఎస్సై హన్మాండ్లు, ఎంపీటీసీ కట్ట రవి, వీడీసీ చైర్మన్ నాలం మహేందర్, టీఎన్జీవో భైంసా యూనిట్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కూరగాయల సాగుపై సమావేశం

ముధోల్: రైతులు కూరగాయల సాగు కోసం ఎఫ్‌పీవోస్ ఏర్పాటు చేసుకోవాలని రిలయన్స్ ఫౌండేషన్ డీపీవో లక్ష్మణ్, నాబార్డు డీడీఎం వీరభద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని తరోడా గ్రామ రైతువేదికలో కూరగాయల సాగుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకొని లాభాలను గడించాలని సూచించారు. రాథోడ్ శ్యామ్, ఏవో భాస్కర్ నాయక్, ఏఈవో బి.విలాస్‌కుమార్, గణపతి పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల పూజలు

తానూరు: మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం భక్తులు పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాల్లో హుండీ ఆదాయం లెక్కించారు. మహాలక్ష్మి ఆలయంలో రూ.2,02,900, పోచమ్మ ఆలయంలో రూ.16,365 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. సర్పంచ్ విఠల్, మాధవ్‌రావ్ పటేల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరిక సంఘం కార్యవర్గం ఎన్నిక

కడెం: మండలంలోని పాండ్వపూర్, కొత్త మద్దిపడగ పెరిక సంఘం గ్రామ కమిటీ కార్యవర్గాలను సంఘం మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. పెరిక సంఘం పాండ్వపూర్ గ్రామాధ్యక్షుడిగా కానుగంటి మల్లేశ్, ఉపాధ్యక్షుడిగా గోపి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా మహేశ్, ముఖ్య సలహాదారులుగా రాజమౌళి, లచ్చన్న, కొత్త మద్దిపడగ గ్రామాధ్యక్షుడిగా లింగాల చిన్న రాజన్న, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్, వెంకటేశ్, శంకర్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెరిక సంఘ జిల్లా అధ్యక్షుడు చుంచు భూమన్న, ప్రధాన కార్యదర్శి లచ్చన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు గొళ్ల వేణుగోపాల్, శేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు భూమిపూజ

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో గోశాల షెడ్డు నిర్మాణానికి ఎంపీ సోయం బాపురావు శనివారం భూమిపూజ నిర్వహించనున్నట్లు గోసంరక్షణ సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.10లక్షలతో షెడ్డు నిర్మించనున్నారు. ఉదయం 10.30 గంటలకు యజ్ఞం, భూమిపూజ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, హిందూవాహిని తెలంగాణ ప్రాంత సంయోజక్ ఉప్పల రాజు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తానూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లతోపాటు అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.